క్లుప్తంగా

బాధిత కుటుంబానికి పరామర్శ

చివ్వెంల(సూర్యాపేట) : మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పబ్బు సైదులు గౌడ్ తల్లి పిచ్చమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. బుధవారం బాధిత కుటుంబాన్ని పలువురు నాయకులు పరామర్శించి ఆమె చిత్ర పటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రౌతు నర్సింహారావు, మాజీ వైస్ ఎంపీపీ జూలకంటి జీవన్ రెడ్డి, ప్రగడ నర్సింహారావు, గొట్టేటి సైదులు యాదవ్, మట్టపల్లి లింగయ్య, షేక్ దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

శమీ పూజకు ఆహ్వానం



ఆహ్వానపత్రిక అందజేస్తున్న సభ్యులు

భానుపురి (సూర్యాపేట) : విజయదశమి సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సాయంత్రం 4 గంటలకు నిర్వహించే శమీ పూజలో పాల్గొనాల్సిందిగా కోరుతూ అదనపు కలెక్టర్ సీతారామరావుకు వినతిపత్రం అందించారు. బుధవారం కలెక్టరేట్ లోని ఆయన ఛాంబర్ లో సంతోషిమాత దేవాలయం ఉపాధ్యక్షుడు పబ్బా ప్రకాశరావు, గోపారపు రాజు కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు.

వైన్స్‌ల ముందు బారులు



నెమ్మికల్‌లో వైన్స్ ఎదుట రద్దీ

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : గాంధీ జయంతి కావడంతో గురువారం వైన్ షాపులు బంద్ కానున్నాయి. ఇదే రోజు దసరా పండుగ ఉండడంతో ప్రజలు ముందుగానే బుధవారం రాత్రి వైన్స్ షాపుల ఎదుట బారులు దీరి తమకు కావాల్సిన మద్యాన్ని కొనుగోలు చేసుకున్నారు.

ఫ్లెక్సీల తొలగింపు



అర్వపల్లిలో ఫ్లెక్సీలను తొలగిస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

అర్వపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ రావడంతో అర్వపల్లి, జాజిరెడ్డిగూడెంలతో పాటు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో బుధవారం రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను తొలగించారు. అదేవిధంగా విగ్రహాలకు ముసుగులు కప్పారు.

జెడ్పీహెచ్‌ఎస్‌లో చోరీ

మునగాల : మునగాల మండలం కలకోవ గ్రామ జెడ్పీహెచ్ఎస్‌లో మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పాఠశాలలోని ప్రధానోపాధ్యాయుడి గదితో పాటు, స్టాఫ్‌రూం, సైన్స్ ల్యాబ్, తొమ్మిదో తరగతి గదిలో ఉన్న ఆరు బ్యాటరీలు, సౌండ్ సిస్టమ్స్, గ్యాస్ బండ చోరీకి గురైనట్లు గుర్తించామని ప్రధానోపాధ్యాయుడు తేజోరామ్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు పేర్కొన్నారు.

35 మంది బైండోవర్

హుజూర్‌నగర్ : నియోజకవర్గ వ్యాప్తంగా గతంలో ఘర్షణలకు పాల్పడిన 35 మందిని దసరా పండుగ సందర్భంగా ఎలాంటి అల్లర్లు జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా బైండోవర్ చేసినట్లు సీఐ చరమందరాజు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. దసరా పండుగను, గాంధీ జయంతిని ప్రశాంతంగా జరుపుకోవాలని ఆయన సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల నియమావళికి అనుగుణంగా నడుచుకోవాలని ఆయన కోరారు.

కనకదుర్గ జాతరకు వేళాయే



విద్యుద్దీపాల వెలుగుల్లో దుర్గమ్మ ఆలయం

మునగాల : మండల కేంద్రంలోని శ్రీవేంకట కనకదుర్గ దేవాలయంలో గురు, శుక్రవారాల్లో అమ్మవారి జాతర నిర్వహణకు ఆలయ అభివృద్ధి కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా దేవాలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. ఇందులో భాగంగా గురువారం రాత్రి గ్రామంలోని పురవీధుల్లో ప్రభ బండ్ల ప్రదర్శన నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం బండ్లు అమ్మవారి ఆలయానికి చేరుకున్న తర్వాత గ్రామస్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకుంటారని ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు దేవరం వెంకటరెడ్డి తెలిపారు.

అటకెక్కిన సబ్‌సెంటర్ల నిర్మాణం

- వివిధ దశల్లో ఆగిపోయిన ఆరోగ్య ఉప కేంద్ర భవనాల పనులు
- ఒక్కో భవనానికి రూ. 20లక్షలు కేటాయింపు
- నిధులు లేవంటూ చేతులెత్తేసిన కాంట్రాక్టర్లు



అనంతారంలో స్లాబ్ లెవల్‌లో నిలిచిపోయిన ఆరోగ్య ఉప కేంద్ర భవనం



అనాజిపురంలో ఆరోగ్య ఉప కేంద్ర పాత భవనాన్ని కూల్చివేసిన ప్రదేశం

పెన్‌పహాడ్: ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంలో భాగంగా అప్పటి ప్రభుత్వం మంజూరు చేసిన హెల్త్ సబ్ సెంటర్ల భవన నిర్మాణ పనులు ఆగిపోయాయి. మండల వ్యాప్తంగా 10 ఆరోగ్య ఉప కేంద్రాలు ఉండగా.. అందులో 6 మాత్రమే శాశ్వత భవనాలు ఉన్నాయి. మిగతావి ప్రభుత్వ కార్యాలయ ఆవరణలో, అద్దె భవనాల్లో తాత్కాలికంగా సేవలందిస్తున్నారు. ఉప కేంద్రాల్లో ఇబ్బందులు తొలగించేందుకు గత ప్రభుత్వం ఒక్కో భవనానికి రూ. 20లక్షల చొప్పున నిధులు మంజూరు చేసింది.

నిలిచిన పనులు

మండలంలోని అనంతారం గ్రామంలోని ఉప కేంద్రం భవనం స్లాబ్ దశలో నిలిచిపోయింది. నిధులు విడుదల కాకపోవడంతో పనులు ఆగిపోయాయి. అదే విధంగా అనాజీపురం గ్రామంలోని ఉప కేంద్రం భవనం శిథిలావస్థకు చేరడంతో నూతన భనవం నిర్మించేందుకు తొలగించారు. నూతన భవన నిర్మాణ పనులు నేటికీ చేపట్టకపోవడంతో స్థలం నిరుపయోగంగా మారింది. ఆరోగ్య ఉప కేంద్రాన్ని గ్రామంలోని ఓ అద్దె గదిలో తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. భక్తాళాపురం ఆరోగ్య ఉప కేంద్రాన్ని గ్రంథాలయ భవనంలో కొనసాగిస్తున్నారు. సింగారెడ్డిపాలెం ఉప కేంద్రం డబల్ బెడ్ రూమ్ ఇళ్లల్లో నిర్వహిస్తున్నారు. నూతన భవనం పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్‌లు ముందుకు రాకపోవడంతో అద్దె గదిలోనే ఉప కేంద్రం కొనసాగుతుంది. ఇక్కడ వసతులు లేక ఆరోగ్య సిబ్బంది, రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అరకొర వసతులు

ఆరోగ్య ఉప కేంద్రాల్లో రోగులు, గర్భిణులకు వైద్య సేవలందిస్తున్నారు. పోషకాహార లోపం ఉన్న వారికి ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు, కుష్టు, క్షయ రోగులకు వైద్యుల సూచనల మేరకు మందులిస్తున్నారు. చిన్నారులకు టీకాలు వేయిస్తున్నారు. గ్రామాల్లో జనన, మరణాలను నమోదు చేస్తున్నారు. అయితే కొన్ని గ్రామాల్లో ప్రస్తుతం ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలు అరకొర వసతుల్లో కొనసాగుతున్నాయి.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



వివిధ దశల్లో నిలిచిపోయిన హెల్త్ సబ్‌సెంటర్ల నిర్మాణాలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. భవన నిర్మాణ పనులు పూర్తి అయ్యేలా తగిన చర్యలు తీసుకుంటాం.

– రాజేష్, మండల వైద్యాధికారి

కేర్ టేకరే దొంగ

- సూర్యాపేటలో జరిగిన చోరీ కేసును ఛేదించిన పోలీసులు
- నిందితురాలి నుంచి 43.6 తులాల బంగారం, రూ.1.75 లక్షల నగదు స్వాధీనం
- రిమాండ్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ నరసింహ



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నరసింహ

సూర్యాపేటటౌన్ : సూర్యాపేట పట్టణంలోని కృష్ణానగర్ కాలనీలో నివాసముంటున్న వృద్ధురాలు సువర్చలాదేవి ఇంట్లో జరిగిన చోరీ కేసును సూర్యాపేట పట్టణ, సీసీఎస్ పోలీసులు ఒక్కరోజులోనే ఛేదించారు. ఇంట్లో పని చేస్తున్న కేర్ టేకరే చోరీ చేసినట్లు పోలీసులు తేల్చారు. ఈ కేసు వివరాలను సూర్యాపేట ఎస్పీ నరసింహ బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణానగర్ కాలనీలో సువర్చలాదేవి ఒంటరిగా నివాసముంటుండగా.. ఆమె ముగ్గురు కుమారులు హైదరాబాద్‌లో ఉంటున్నారు. సువర్చలాదేవిని చూసుకోవడం కోసం ఖమ్మం జిల్లా నాయికన్‌గూడేనికి చెందిన కరిమా బేగం అనే మహిళను కేర్ టేకర్‌గా పెట్టుకున్నారు. ఆమె నమ్మకంగా పనిచేస్తూ వృద్ధురాలి వద్ద తాళం చేతులు గమనించి ఆమె ఇంట్లో బీరువాలో ఉన్న 40 తులాల బంగారు బిస్కెట్లు, మూడున్నర తులాల బంగారపు చంద్రహారం, నగదును దొంగిలించింది. సువర్చలాదేవి కుమారులు ఇంట్లో బంగారం కనిపించకపోవడంతో సూర్యాపేట టౌన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. కేర్ టేకర్ కరీమా బేగంపై అనుమానంతో ఆమెను అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకుందని ఎస్పీ వివరించారు. ఆమె నుంచి 40 తులాల నాలుగు బంగారు బిస్కెట్లు, మూడున్నర తులాల చంద్రహారం, రూ.1.75 లక్షల నగదును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ పేర్కొన్నారు. ఈ కేసును ఛేదించిన సూర్యాపేట టౌన్ సీఐ వెంకటయ్య, సీఐ శివకుమార్, ఎస్ఐలు శివతేజ, సురేష్, సూర్యాపేట పట్టణ పోలీస్ సిబ్బంది, సీసీఎస్ సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డ్ అందించారు.

పురుషోత్తంరెడ్డికి నివాళి



పురుషోత్తంరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యేలు సామేల్, పద్మావతి

తిరుమలగిరి (తుంగతుర్తి) : మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తండ్రి ఉత్తమ్ పురుషోత్తంరెడ్డి చనిపోయి ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం ఆయన సొంత గ్రామమైన తిరుమలగిరి మండలం తాటిపాములలో గ్రామస్తులకు సహపంక్తి భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తన తండ్రి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామస్తులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. గ్రామంలో చిన్నప్పటి స్నేహితుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్, కోదాడ శాసన సభ్యురాలు ఉత్తమ్‌పద్మావతి, జిల్లా అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్, కాసోజు శంకరమ్మ, పీఏసీఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్, పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ జమ్మిలాల్, అంబేద్కర్, ఎర్ర యాదగిరి, కిషన్, కృష్ణ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల బరిలో ధర్మ సమాజ్ పార్టీ

నాగారం : స్థానిక సంస్థల ఎన్నికల్లో ధర్మ సమాజ్ పార్టీ పోటీలో ఉంటుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చిప్పలపల్లి నాగార్జున తెలిపారు. బుధవారం నాగారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర అధినాయకులు డాక్టర్ విశారదన్ మహరాజ్ ఆదేశాల మేరకు నాగారం మండలంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలకు జరిగే ఎన్నికలకు ధర్మ సమాజ్ పార్టీ పోటీ చేస్తుందని స్పష్టం చేశారు.

దేశ భద్రతలో ఆర్మీ జవాన్ల పాత్ర కీలకం



మాట్లాడుతున్న బండపల్లి సురేందర్

నూతనకల్: దేశ భద్రతలో ఆర్మీ జవాన్ల పాత్ర కీలకమని ప్రజా యుద్ధ నౌక కళాకారుడు ఏపూరి సోమన్న, తెలంగాణ రాజ్యాధికార పార్టీ ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ అన్నారు. బుధవారం నూతనకల్ మండల కేంద్రానికి చెందిన బండపల్లి సురేందర్‌గౌడ్ ఆర్మీ విభాగంలో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. బండపల్లి సురేందర్ దంపతులను తహసీల్దార్ కార్యాలయం నుంచి ఐఎల్ఆర్ ఫంక్షన్ హాల్ వరకు భారీ ర్యాలీతో స్వాగతం పలికారు. వారిని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఆర్మీ సుబేదార్ బండపల్లి సురేందర్ మాట్లాడుతూ.. దేశరక్షణ కోసం విధులు నిర్వర్తించి మండల ప్రజల ఆశీర్వాదాలు పొందడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో జేఎం గ్రూప్ చైర్మన్ జక్కుల మల్లేష్ యాదవ్, ఆర్మీ జవాన్లు వేల్పుల వెంకటమల్లు, వీరబోయిన సందీప్ యాదవ్, గుగులోతు ధారాసింగ్, ఏసుదాస్, శంకర్, వెంకట్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

- ఎమ్మెల్యే మందుల సామేల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

తిరుమలగిరి (తుంగతుర్తి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులదే విజయమని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. బుధవారం తిరుమలగిరిలో ఆయన తన నివాసంలో మాట్లాడారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలందరూ సిద్ధంగా ఉండాలని, గ్రామాల్లో సమన్వయంతో ముందుకు వెళ్లాలని కోరారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు, సన్న బియ్యం అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే యూరియా కొరత వచ్చిందని తెలిపారు. ప్రతి మండలానికి సమన్వయ కమిటీ ఏర్పాటు చేసి అభ్యర్థులను నిర్ణయిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీ నాయకులదని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రైతు కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్న యాదవ్, మండల అధ్యక్షులు వై.నరేష్, నాగం సుధాకర్‌రెడ్డి, అవిలుమల్లు, లింగయ్య, జోజి ,జమ్మిలాల్, పీఏసీఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్, అంబేద్కర్ పాల్గొన్నారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి



మద్దిరాల రైతువేదికలో మాట్లాడుతున్న సహాయ జిల్లా ఎన్నికల అధికారి సత్యనారాయణరెడ్డి



భానుపురి (సూర్యాపేట) : మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి శ్రీనివాస్

మద్దిరాల : స్థానిక సంస్థల ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని సహాయ జిల్లా ఎన్నికల అధికారులు అయేషా పర్వీన్, సత్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం మద్దిరాల మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎన్నికల నిర్వహణపై అధికారులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

భానుపురి (సూర్యాపేట) : ఎన్నికల నియమావళి ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం స్థానిక రైతు వేదికలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లా మాస్టర్ ట్రెనీ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ హసీం, టీఓటీలు వెంకటరెడ్డి, బోసు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

తిరుమలగిరి (తుంగతుర్తి) : ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలని తహసీల్దార్ హరిప్రసాద్ కోరారు. బుధవారం తిరుమలగిరి తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుపై పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పాలనా అధికారులు, ఇతర సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అన్ని రాజకీయ పార్టీలకు, పోటీచేసే అభ్యర్థులకు, స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధం ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు వర్తిస్తుందని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీడీఓ లాజర్, ఎంపీఓ భీమ్‌సింగ్, డిప్యూటీ తహసీల్దార్ జాన్‌మహ్మద్, మాస్టర్ ట్రైనర్ అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

అధికారులకు అవగాహన సదస్సు

తుంగతుర్తి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండల పరిషత్ అధికారి శేషు కుమార్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ ఎన్నికల అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ దయానందం మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్నికల నియమ, నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. సమావేశంలో తుంగతుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నరసింహారావు, ఎస్సై క్రాంతి కుమార్, ఆర్ఐలు రవీందర్ రెడ్డి, శ్రీనివాస్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సమర్థవంతంగా నిర్వహించాలి

నాగారం : స్థానిక సంస్థల ఎన్నికలను అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని ఎంపీడీఓ మారయ్య అన్నారు. బుధవారం నాగారం మండల పరిధిలోని ఫణిగిరి క్లస్టర్ రైతు వేదికలో స్థానిక సంస్థల ఎన్నికలపై ఎన్నికల ప్రెసిడింగ్ అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ, గ్రామ పంచాయతీల ఎన్నికల్లో ఎలాంటి తప్పులు దొర్లకుండా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణపై ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్నికల నియమాలపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరికిషోర్ శర్మ, ఎంఈఓ వాసం ప్రభాకర్, మాస్టర్ ట్రైనర్లు నాగు, మల్లయ్య, బ్రహ్మం, ఉపాధ్యాయులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

అర్వపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బాషపాక శ్రీకాంత్ అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పక్షాలతో స్థానిక ఎన్నికల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నియమావళికి సంబంధించిన అంశాలను వివరించారు. సమావేశంలో ఎంపీడీఓ గోపి, సూపరింటెండెంట్ రామకృష్ణ, వివిధ రాజకీయ పక్షాల నాయకులు పాల్గొన్నారు.

పోలింగ్ అధికారులకు శిక్షణ

తిరుమలగిరి (తుంగతుర్తి) : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అనంతారం మోడల్ స్కూల్‌లో బుధవారం పీఓ, ఏపీఓ, ఏఆర్ఓ, ఆర్వోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ హరిప్రసాద్, ఎంపీఓ భీమ్‌సింగ్, మాస్టర్ ట్రైనర్‌లు అశోక్‌రెడ్డి, సైదులు, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

పీఓలు, ఏపీఓలకు శిక్షణ

అర్వపల్లి: స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి బుధవారం రామన్నగూడెం రైతువేదికలో మండలంలోని పీఓలు, ఏపీఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు సంబంధించి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాషపాక శ్రీకాంత్, ఎంపీడీఓ గోపి, సూపరింటెండెంట్ రామకృష్ణ, శిక్షకులు సైదులు, మల్లయ్య, జూనియర్ అసిస్టెంట్ శిల్పిక, కార్యదర్శులు సుధాకర్, రాజశేఖర్‌రెడ్డి, నారాయణమూర్తి, రమేష్, ఓఎస్ రాములు, సిబ్బంది పాల్గొన్నారు.

నియమావళి ప్రకారం నిర్వహించాలి

పెన్‌పహాడ్: ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలని ఎంపీడీఓ జానయ్య అన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో పీఓ, ఏపీఓలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నియమావళి ప్రకారం ఎన్నికలు సజావుగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లాలు, ఎంపీఓ రాజేశ్వర్, ఎంఈఓ నకిరేకంటి రవి, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, టీఓటీలు శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు



బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో గ్రామ, మండల యూత్ కాంగ్రెస్‌ల సౌజన్యంతో డీసీసీ ఉపాధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది దరూరి యోగానందచారి ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ పోటీలలో నూతనకల్ ప్రథమ, కోదాడ ద్వితీయ, హుజూర్‌నగర్ తృతీయ, జాజిరెడ్డిగూడెం నాలుగవ, మోతె జట్లు ఐదో బహుమతి సాధించాయి. వీరికి నగదు బహుమతి, షీల్డులను అందజేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింగ కృష్ణమూర్తి, వల్లాల ఖాజ, బింగి కృష్ణమూర్తి, మామిడి అనిల్, రాజ్‌కుమార్, రాంబాబు, విజయ్, సందీప్, మధు, యాదగిరి, లోకేష్, నరేష్, మహేష్, సాయి, చందు పాల్గొన్నారు.

శమీపూజకు ఏర్పాట్లు పూర్తి



షమీపూజ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి

సూర్యాపేట అర్బన్: విజయదశమి సందర్భంగా గురువారం సాయంత్రం నిర్వహించే షమీపూజకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు మున్సిపల్ కమిషనర్ హనుమంతరెడ్డి తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డలో గల మండల పరిషత్ కార్యాలయంలో షమీ పూజ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భక్తుల సౌకర్యార్థం జమ్మి చెట్టు, మంచినీటి సౌకర్యం, లైటింగ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పలువురు రాజకీయ నాయకులు, పట్టణ ప్రజలు పెద్దఎత్తున పాల్గొంటారని పేర్కొన్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, శ్రీసంతోషిమాత దేవాలయం ప్రధాన కార్యదర్శి బ్రాహ్మణపల్లి మురళీధర్, ఉపాధ్యక్షులు పబ్బా ప్రకాశరావు, గోపారపు రాజు, మున్సిపల్ సిబ్బంది వేణు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

- మాజీ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్



మునగాలలో బీఆర్ఎస్ ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మల్లయ్య

మునగాల : త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలని పార్టీ కోదాడ నియోజవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని వాసవీ భవన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారంటీలు 420 హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం అవి అమలు చేయకుండా ప్రజలను నిలువునా మోసం చేసిందని ఎద్దేవా చేశారు. ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న మోసాలను ప్రజలకు చేరవేయాలని కార్యకర్తలను కోరారు. భవిష్యత్‌లో తెలంగాణలో రాబోయేది కేసీఆర్ పాలనేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజలలో తీవ్ర వ్యతిరేకత ఉందని, కేసీఆర్ పాలన రావాలంటే ఈ స్థానిక ఎన్నికల్లో పునాదులు వేయాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాలలో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పట్టేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు తొగరు రమేష్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో పార్టీ మండల నాయకులు కందిబండ సత్యనారాయణ, సుంకర అజయ్‌కుమార్, తొగరు సీతరాములు, వల్లపురెడ్డి రామిరెడ్డి, కోల ఉపేందర్ రావు, బాలాజీ ప్రదీప్ పాల్గొన్నారు.

గాంధీ పార్క్‌లో స్వచ్ఛతా హీ సేవా

హుజూర్‌నగర్ : పట్టణంలో బుధవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. గాంధీ పార్క్‌లోని వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ పరిసర ప్రాంతాల్లో చెత్త, పిచ్చి మొక్కలను తొలగించి డంపింగ్ యార్డ్‌కు తరలించారు. మహాత్మా గాంధీ విగ్రహాన్ని కడిగి శుభ్రం చేశారు.శ్రమదానం చేసిన మున్సిపల్, మెప్మా సిబ్బందికి సన్మానించారు.

మహిషాసురమర్ధినిగా దుర్గామాత



చివ్వెంల(సూర్యాపేట) : తిమ్మాపురంలో మండపం వద్ద హోమం నిర్వహిస్తున్న భక్తులు



తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరిలో పూజలు చేస్తున్న మార్కెట్ చైర్‌పర్సన్ చామంతి



అర్వపల్లి: అర్వపల్లిలో దుర్గాదేవి మండపం వద్ద ముగ్గుల పోటీలు



మద్దిరాల : కుక్కడం గ్రామంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



తుంగతుర్తి: రామాలయంలో..



అర్వపల్లి: జాజిరెడ్డిగూడెంలో..